
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

జగిత్యాల జిల్లా వార్తలు 5★★
సోమవారం 23 సెప్టెంబరు 2024

కొడుకుకు గడ్డిమందు తాగిచ్చి హత్యాయత్నం
● వివాహేతర సంబంధం బయటపడుతుందని..
● ప్రియుడితో కలిసి అఘాయిత్యం..
7లో..

ప్లాస్టిక్ నియంత్రణ ఆగేదెన్నడో..?
● విచ్చలవిడిగా పాలిథిన్ కవర్ల వినియోగం
8లో..



ప్రైవేట్ దందా

● బుక్స్‌తో పాటు అన్ని రకాల విక్రయాలు
● విద్యార్థుల నుంచి వేలల్లో ఫీజులు వసూళ్లు ● విద్యార్థులపై ఒత్తిడి
● ఇష్టారాజ్యంగా ప్రైవేట్ స్కూళ్ల వ్యవహారం
● పట్టించుకోని విద్యాశాఖ అధికారులు

జగిత్యాల అగ్రికల్చర్, సెప్టెంబరు 22 : జిల్లాలో ప్రైవేట్ స్కూళ్లలో విద్య పూర్తిగా వ్యాపారంగా మారింది. ఓవైపు స్కూల్ ఫీజులు కట్టలేకనే పోషకులు ఇబ్బందులు పడుతుంటే పుస్తకాల కొనుగోలు నుంచి మొదలు టై, బెల్ట్, షూ,సాక్స్, ఐడీకార్డు, ఇంటర్నల్ పరీక్షలు, వ్యాన్ ఫీజులు, ఇతర కరికులం యాక్టివిటీస్, ప్రాజెక్టు పేరుమీద వందలాది రూపాయల భారాన్ని పోషకులపై మోపుతున్నారు. ప్రైవేట్ పాఠశాలల నిర్వాహకులు. వీటికి తోడు ట్యూషన్ ఫీజుల కింద ఎల్‌కేజీకి రూ.15వేల నుంచి మొదలు, పదవతరగతి వరకు సుమారు రూ.75వేల వరకు తీసకునే పాఠశాలలు ఉన్నాయంటే ఎలాంటి అతిశయోక్తి లేదు. చాలా స్కూళ్లు నిబంధనలకు విరుద్ధంగా నడిచిన, పాఠశాల పేరుతో, కార్పొరేట్ ట్యాగ్‌లతో అనుమతులు లేకున్నా పాఠశాలల నిర్వహణ సాగుతోంది. ఇవన్నీ విద్యాశాఖ అధికారుల నోటీసులో ఉన్నా, తమకేదీ పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

నిబంధనలు గాలికి..

ప్రైవేట్ పాఠశాలల్లో ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఎక్కడా కూడా నడుచుకోవడం లేదు. విద్యార్థుల కోసం మైదానం, ఫైర్‌సేఫ్టీ, పార్కింగ్, తరగ తులకు వెంటిలేషన్ తప్పనిసరిగా ఉండాలి. కానీ జిల్లాలోని ప్రైవేట్ పాఠశాలల్లో కనీస మౌలిక వసతులు కూడా లేవు. మున్సిపల్ నుంచి విధిగా శానిటేషన్ సర్టిఫికేట్ సైతం తీసుకోవాల్సి ఉంటుంది. దీన్ని ఏటా రెన్యూవల్ చేసుకోవాల్సి ఉండగా ఎక్కడా కూడా ఈ తరహా విధానం అమలు కావడం లేదని సమాచారం. దీనికి తోడు కొన్ని పాఠశాలల్లో ఇంటర్ పూర్తయి ఖాళీగా ఉన్నవారిని ప్రీ ప్రైమరీ టీచర్లుగా, డిగ్రీ పూర్తి అయిన వారిని ప్రైమరీ, యూపీఎస్ పాఠశాల తరగతుల విద్యా ర్థులకు బోధన కోసం తక్కువ వేతనాలకు రిక్రూట్ చేసుకుంటూ అనుభవం లేని వారితో విద్యాబోధన సాగిస్తున్నారు.

ఫిర్యాదు చేస్తేనే చర్యలా..?

ఫీజుల భారం, టీసీల కోసం ఫీజులు వసూలు, పుస్తకాల విక్రయాలు, ఇతర మెటీరియల్ విక్రయాలు యథేచ్ఛగా జరుగుతున్న విద్యాశాఖ అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇదే విషయంపై విద్యాశాఖ అధికారులను వివరణ కోరితే ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటామని పేర్కొనడంపై సైతం అసహనం వ్యక్తం చేస్తున్నారు. పోషకులు, విద్యార్థి సంఘాలు ఫిర్యాదు చేస్తేనే చర్యలు తీసుకోవడం తప్ప, తమవంతు బాధ్యతగా పాఠశాలలపై మానిటరింగ్ చేసే పద్ధతిని పాటించడం లేదని పోషకులు, విద్యావేత్తలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

నామమాత్రపు తనిఖీలు?

ప్రైవేట్ పాఠశాలల్లో విద్యాశాఖ అధికారుల తనిఖీలు నామ మాత్రం గానే జరుగుతాయనే ప్రచారం సాగుతోంది. విద్యార్థులకు కావల్సిన మౌలిక వసతులు, తరగతి గదులు నిర్వహణ, పాఠశాల పరిసరాలు, తదితర అంశాలపై ఎప్పటికప్పుడు పరిశీలించడంతో పాటు, పాఠశాలల నిర్వహణ కు సంబంధించిన అన్ని సర్టిఫికెట్లు ఉన్నాయా లేదా అనేది అధికారులు తనిఖీలు చేయాల్సి ఉంటుంది. అవేవి మచ్చుకు కూడా కనిపించడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

నియంత్రణ లేని ఫీజులు

జిల్లాలోని ప్రైవేటు పాఠశాలల్లో ఫీజులపై సైతం నియంత్రణ లేకుండా పోయింది. ఏ పాఠశాలలో ఆయా యాజమాన్యాలు ఇష్టానుసారంగా ఫీజులు నిర్ణయించుకొని వసూలు చేసుకుంటున్నారు. అంతేకాకుండా బుక్స్, టై, బెల్ట్‌లు అదే పాఠశాలలో కొనుగోలు చేయాలని నిబంధనలు పెడుతుండగా, కొన్ని కార్పొరేట్ పాఠశాలలు యూనిఫాం క్లాత్‌లు తెచ్చి, దర్జీలను పిలిపించి, విద్యార్థుల కొలతలతో దుస్తులు సైతం కుట్టించి, యూనిఫాం ఫీజులు వసూలు చేస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొన్ని పాఠశాలల యాజమాన్యాలు ఫీజులు కట్టని విద్యార్థులను బయట నిలబెట్టడం, లేదా తల్లిదండ్రులకు ఫోన్‌లు చేయిస్తూ మానసికంగా ఇబ్బందులకు గురి చేస్తున్నారు. పరీక్షల నిర్వహణ నెపంతో ఫీజుల వసూలుకు హాల్ టికెట్లు ఇచ్చే నెపంతో ఫీజులు వసూలు చేసుకోని హా ల్ టికెట్లు ఇస్తున్నారు. వా స్తవంగా విద్యార్థులకు సీటింగ్ అలాంట్‌మెంట్, జంబ్లింగ్ విధానంపై అవగాహన కోసం కేటాయించిన హాల్ టికెట్లను ఫీజుల వసూలుకు వాడు తున్నా విద్యాశాఖ అధికారులు దృష్టికి రాకపోవడం గమనార్హం.

లాభాలే ధ్యేయంగా విద్యా వ్యాపారం



ప్రైవేట్ విద్యను పూర్తిగా మార్చి, లాభాలే లక్ష్యంగా నిర్వహణ సాగి స్తున్నారు. జిల్లాలో చాలా వరకు ప్రైవేట్ పాఠశాలలు నిబంధనలకు వి రుద్ధంగా నడుస్తున్నాయి. అనుమతులు లేక స్థానికంగా మూసిఉన్న పాఠశాలల పేర్లను కొనుగోలు చేసి కార్పొరేట్ పాఠశాలలు నిర్వహిస్తున్నారు. చాలా అంశాలపై పలుమార్లు ఎంఈవోలు, డీఈవోలకు వినతులు ఇచ్చిన ఫలితం లేకుండా పోతోంది. వాస్తవాలను తెలుసుకునేందుకు విద్యాశాఖపై కలెక్టర్ ప్రత్యేక దృష్టిసారించి, ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలపై కొరడా ఝులిపించాలి.

- మల్యాల రాకేష్, ఏబీవీపీ రాష్ట్ర సమితి కార్యదర్శి

విద్యాశాఖ అధికారులే సహకరిస్తున్నారు



ప్రైవేట్ విద్యాసంస్థల ఆర్థిక దోపిడీకి పరోక్షంగా, పత్యక్షంగా విద్యాశాఖ అధికారులే సహకరిస్తున్నారు. పాఠశాలల్లో ఫీజులు వివరాల బోర్డుల ప్రద ర్శన ఏ పాఠశాలలో లేదు. పార్కింగ్, ఫైర్‌సేఫ్టీ ఉండదు. అర్హులైన టీచర్లు లేకుండానే విద్యాబోధన సాగుతోంది. విద్యాశాఖ అధికారుల పర్యవేక్షణ కరువైంది. ప్రైవేట్ పాఠశాలల్లో బుక్స్ విక్రయాలపై ఫిర్యాదు చేస్తే తప్ప, నేరుగా తనిఖీలు చేసే పరిస్థితి లేదు. విద్యాశాఖ పై కలెక్టర్ సమీక్ష నిర్వహించాలి. నేరుగా ప్రైవేట్ పాఠశాలలను తనిఖీ చేయాలని కోరుతున్నాం.

- అక్రమాలిక్, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి

నిబంధనలు అతిక్రమిస్తే ఉపేక్షించేది లేదు



ప్రైవేట్ పాఠశాలలు నిబంధనలు అతిక్రమిస్తే ఉపేక్షించేది లేదు. విధిగా జిల్లాలో ఎంఈవోలు, డీవోగా నేను తనిఖీలు చేస్తున్నాం. ప్రతి పాఠశాల నిర్వాహకులు ప్రభుత్వ నిబంధనలు పాటించాలి. లేని పక్షంలో చర్యలు తీసుకుంటాం.

- డాక్టర్ జగన్మోహన్ రెడ్డి, డీఈవో

రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి

రెడ్డి సంఘం ప్రమాణ స్వీకారంలో జీవన్ రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న జీవన్ రెడ్డి

జగిత్యాల అర్బన్, సెప్టెంబరు 22: రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి చేయడమే తన లక్ష్యమని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు. జగిత్యాల మండలం ధరూర్ గ్రామంలోని రెడ్డి కల్యాణ మండపంలో ఆదివారం నూతనరెడ్డి జన సంఘం ప్రమాణ స్వీకార కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా జీవన్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో మహిళల కోసం వసతి గృహం ఏర్పాటు చేయడానికి కృషి చేస్తానని అన్నారు. రెడ్డి జన సంఘం జిల్లా అధ్యక్షుడిగా కొప్పెర వెంకట్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా కిష్టంపేట రాంచంద్రారెడ్డి, కోశాధికారిగా నేరెళ్ల భూమారెడ్డ, ఉపాధ్యక్షులుగా గడ్డం చం ద్రశేఖర్ రెడ్డి, నాగిరెడ్డి రజిత రెడ్డి, సంయుక్త కార్యదర్శులుగా వెల్మ నవీన్ రెడ్డి, అయిల్నేని ప్రియాంక రెడ్డితో పాటు 8 మంది కార్యవర్గ సభ్యులతో ఎన్నికల అధికారులు నరసింహారెడ్డి, మహిపాల్‌రెడ్డి ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్య క్రమంలో సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, డాక్టర్ శైలేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

జోష్ నింపిన అల్ఫోర్స్ స్పార్కిల్-2024

హాజరైన విద్యాసంస్థల అధినేత నరేందర్‌రెడ్డి



నృత్యాలు చేస్తున్న విద్యార్థినులు

జగిత్యాల అగ్రికల్చర్, సెప్టెంబరు 22: సాంస్కృతిక కార్యక్రమాలతో నూతన ఉత్సాహం కలుగుతుందని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డా.నరేందర్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని స్థానిక ఓ ప్రైవేట్ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన స్వాగతోత్సవ వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన సరస్వతీదేవి చిత్రపటానికి పూలమాల వేసి, జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులు విద్యతో పాటు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. విద్యార్థినుల నృత్య ప్రదర్శనలు ఆహూతులను అలరించాయి. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్, ప్రిన్సిపాల్, అధ్యాపకులు, పోషకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దక్షిణ భారత సైన్స్ డ్రామా ఫెస్టివల్

జగిత్యాల అగ్రికల్చర్, సెప్టెంబరు 22: జిల్లాలోని అన్ని యాజమాన్య పాఠశాలల విద్యార్థులకు జిల్లా స్థాయి డ్రామా ఫెస్టివల్ నిర్వహిస్తున్నట్లు డీఈవో జగన్మోహన్ రెడ్డి తెలిపారు. జాతీయ సైన్స్ డ్రామా ఫెస్టివల్‌కు సన్నాహకంగా విశ్వేశ్వరయ్య ఇండస్ట్రీయల్ అండ్ టెక్నాలాజికల్ మ్యూజియం బెంగుళూరు వారి ఆధ్వర్యంలో నవంబర్‌లో జరుగు దక్షిణభారత సైన్స్ డ్రామా ఫెస్టివల్ ఎంపికకు పలు అంశాలపై సైన్స్ డ్రామా జిల్లా కేంద్రంలోని టీచర్స్ భవన్‌లో ఈ నెల 28న జరుగుతాయన్నారు. విద్యాశాఖచే జారీ చేసిన గుగూల్ ఫారంను ఈ నెల 26 లోను తమ వివరాలను నమోదు చేసుకోవాలన్నారు. జిల్లా స్థాయి డ్రామా ఫెస్టివల్‌లో ఉత్తమంగా ఎంపికైన మొదటి రెండు డ్రామాలు అక్టోబర్ 17,18 తేదీల్లో రాష్ట్రస్థాయిలో జరిగే సైన్స్ డ్రామా ఫెస్టివల్‌కు ఎంపికైతాయన్నారు. మరిన్ని వివరాలకు జిల్లా సైన్స్ అధికారి మచ్చ రాజశేఖర్ ను 9440212333 లో సంప్రదించాలని సూచించారు.

పోచమ్మ తల్లి ఆశీస్సులు అందరిపై ఉండాలి

జగిత్యాల క్రైం, సెప్టెంబరు 22 : లోకమాత పోచమ్మ తల్లి కృపా, కరుణ, కటాక్షాలు ప్రజలందరిపై ఉండాలని మున్సిపల్ చైర్ పర్సన్ అడువాల జ్యోతి, బీజేపీ నియోజక వర్గ ఇన్‌చార్జి బోగ శ్రావణి అన్నారు. జిల్లా కేంద్రంలోని పురాణీ పేటలో ఉన్న శ్రీలోకమాత పోచమ్మతల్లి ఆలయంలో 62వ వార్షికోత్సం సందర్భంగా మహిళలు అందించిన ఓడి బియ్యాన్ని అన్న ప్రసాదంగా నిర్వహించారు. మున్సిపల్ చైర్ పర్సన్ అడువాల జ్యోతి, బీజేపీ నియోజక వర్గ ఇంచార్జి బోగ శ్రావణిలతో పాటు భక్తులు అధిక సంఖ్యలో హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం దుర్గాదేవి శరన్నవరాత్రుల ఆహ్వాన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు గాజుల రాజేందర్, కౌన్సిలర్ లలిత ఉన్నారు.


కర పత్రాలను ఆవిష్కరిస్తున్న శ్రావణి, జ్యోతిలు

చరిత్రను వక్రీకరించేందుకు బీజేపీ కుట్రలు

సీపీఎం రాష్ట్ర నాయకులు పుప్పాల శ్రీకాంత్



మాట్లాడుతున్న శ్రీకాంత్

జగిత్యాల అగ్రికల్చర్, సెప్టెంబరు 22: దొరలకు, భూస్వాములకు వ్యతిరేకంగా సాగిన పోరాటానికి బీజేపీ మతం రంగు పులిమి, చరిత్రను వక్రీకరించే కుట్రలు చేస్తోందని సీపీఎం రాష్ట్ర నాయకులు పుప్పాల శ్రీకాంత్ అన్నారు. జిల్లా కేంద్రంలోని సీపీఎం కార్యాలయంలో వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట పక్షోత్సవాల సభ సీపీఎం జిల్లా కన్వీనర్ తిరుపతినాయక్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన శ్రీకాంత్ మాట్లాడుతూ భూమి కోసం, భుక్తికోసం, వెట్టిచాకిరీ నుంచి విముక్తికోసం సాగిన వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట స్ఫూర్తితో ఉద్యమంలో పాల్గొని అమరులైన వారికి ప్రతీకగా అమరుల స్థూపాలు ఏర్పాటు చేయాలని అన్నారు. తెలంగాణలో కమ్యూనిస్టుల ఆధ్వర్యంలో సాగిన ఈ మహోన్నత పోరాటంలో ఎందరో వీరులు అమరులయ్యారని, వీళ్లంతా కుల,మతాలు పక్కనబెట్టి దోపిడీ, వెట్టిచాకిరి విముక్తికి పోరాడారన్నారు. బీజేపీ స్వార్ధరాజకీయ ప్రయోజనాల కోసం రైతాంగ పోరాటానికి మతం రంగు పులిమితే ప్రజలే బుద్ధి చెప్తారన్నారు. దున్నేవాడికే భూమి కావాలని పోరు చేసిన అమరవీరుల త్యాగాలను ప్రజలకు తెలిసే విధంగా జగిత్యాల పట్టణంలోని ప్రధాన కూడళ్లలో వారి కాంస్య విగ్రహాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు ఇందూరి సులోచన, కోమటి చంద్రశేఖర్, వెంకటాచారి, రమేష్, సిరికొండ చంద్రయ్య, శంకర్, మల్యాల సురేష్, బొర్ర శేఖర్, రఫీక్, సులేమాన్, రజిత, రాధ, పూజ, తిరుపతిరెడ్డి తదితరులున్నారు.

కిక్ బాక్సింగ్‌లో ప్రతిభ


విద్యార్థిని హేమ

జగిత్యాల అగ్రికల్చర్, సెప్టెంబరు 22: జగిత్యాలలో గల ప్రజ్ఞ గ్లోబల్ స్కూల్‌లో చదువుతున్న వోరుగొండ హేమహాసిని కిక్ బాక్సింగ్‌లో తన సత్తా చాటింది. తమిళనాడులోని చెంగలపట్టులో జరిగిన దక్షిణ భారత స్థాయి సీబీఎస్ఇ అండర్ 17లో బాక్సింగ్ పోటీల్లో పాల్గొని రజత పతకం సాధించి, జాతీయస్థాయి పోటీలకు అర్హత సాధించిందని పాఠశాల యాజమాన్యం తెలిపింది.

ఈ సందర్భంగా హేమను పాఠశాల యాజమాన్యం అనిల్, రాజశేఖర్‌తో పాటు బాక్సింగ్ కోచ్ వంశీకృష్ణ అభినందనలు తెలిపి, హర్షం వ్యక్తం చేశారు.

రిటైర్డ్ సబ్‌రిజిస్ట్రార్ మృతి

జగిత్యాల అగ్రికల్చర్, సెప్టెంబరు 22: పట్టణానికి చెందిన రిటైర్డ్ సబ్ రిజిస్ట్రార్ బోగ అమృతరాజం(70) ఆదివారం ఉదయం అనారోగ్యంతో మృతి చెందాడు. ఆయన జిల్లా టీఎన్జీవో సంఘ అధ్యక్షుడు బోగ శశిధర్‌కు సోదరుడు కాగా అమృతరాజం మృతి పట్ల తెలంగాణ పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు హరి అశోక్ కుమార్‌తో పాటు సంఘ సభ్యులు సంతాపం వ్యక్తం చేసి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. హరి అశోక్ వెంట సంఘ బాధ్యులు బొల్లం విజయ్, గౌరిశెట్టి విశ్వనాథం, ప్రకాష్, యాకుబ్ తదితరులున్నారు.

యువజన సంబురాలకు శ్రీకారం

● జిల్లా స్థాయి కళాకారుల ఎంపికలు
● యువతీ యువకులకు 10 కేటగిరీల్లో ప్రదర్శన పోటీలు
● ఈ నెల 25వ తేదీ వరకు వివరాల నమోదుకు అవకాశం



జగిత్యాల, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మారుమూల పల్లెల్లో యువతలో దాగిఉన్న ప్రతిభను గుర్తించేందుకు తెలంగాణ ప్రభుత్వం యువజన సంబురాలకు శ్రీకారం చుట్టింది. చదువుతో పాటు కళలు, కళా ప్రదర్శనలు ఆటల్లో యువతను ప్రోత్సహిస్తోంది. అందులో భాగంగా పది కేటగిరీల్లో ప్రదర్శనలకు అవకాశం ఇస్తూ...జిల్లా స్థాయి యువజన కళాకారుల ఎంపిక పేరిట పోటీలు నిర్వహించనున్నారు. కళాకారుల ఎంపిక కోసం ఈ నెల 26న జిల్లా కేంద్రంలోని స్వామి వివేకానంద మినీ స్టేడియంలో యువజన క్రీడల శాఖ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. జానపద నృత్యం (గ్రూప్, వ్యక్తిగతం), జానపద పాటలు (గ్రూప్, వ్యక్తిగతం), కవిత్వం (హిందీ, ఇంగ్లీష్) వ్యాసరచన చిత్ర లేఖనం, ఉపన్యాసం (హిందీ, ఇంగ్లీష్), యువక్రితి (హస్తకళలు, వస్త్రాలు, వ్యవసాయ ఉత్పత్తి), సైన్స్ మేళా నిర్వహిస్తున్నారు. 15 నుంచి 29 సంవత్సరాల లోపు వయసు వారు మాత్రమే అర్హులు. ఇందుకు సంబంధించి కలెక్టర్ సత్య ప్రసాద్ ఆదేశాల మేరకు సంబంధిత శాఖ అధికారులు జిల్లాలో విస్తృత ప్రచారం చేస్తున్నారు. ఆసక్తి కలిగిన యువతీ యువకులు ఈ నెల 25వ తేదీలోగా కలెక్టరేట్ జిల్లా యువజన, క్రీడల కార్యాలయంలో వ్యక్తిగతంగా లేదా మెయిల్ ద్వారా, వాట్సప్ 9059465889 నంబర్‌లో వివరాలతో కూడిన పేర్లను నమోదు చేసుకోవచ్చు.

● జిల్లా రాష్ట్ర, జాతీయ స్థాయి వరకు...

మొత్తం పది కేటగిరీలు ఉండగా...ప్రథమ స్థానంలో నిలిచిన వారిని రాష్ట్ర స్థాయికి ఎంపిక చేస్తారు. రాష్ట్ర స్థాయిలో మొదటి స్థానంలో నిలిచిన విజేతలను వచ్చే ఏడాది జనవరి 12 నుంచి 16 వరకు జాతీయ స్థాయిలో జరిగే వేడుకలను పంపిస్తారు.

● జానపద నృత్య బృందం

ఈ బృందంలో సభ్యుల సంఖ్య 10కి మించరాదు. ప్రదర్శనకు గరిష్ట కాల పరిమితి 15 నిమిషాలు

● జానపద పాటల బృందం

సభ్యుల సంఖ్య 10 మందికి మించరాదు. ప్రదర్శనకు గరిష్ట కాల పరిమితి 7 నిమిషాలు.

● జానపద నృత్యం (వ్యక్తిగతం)

ఈ బృందంలో ఐదుగురికి మించరాదు. ప్రదర్శనకు గరిష్ట కాలపరిమితి 7 నిమిషాలు

● జానపద పాటలు (వ్యక్తిగతం)

ఇందులో 5గురు సభ్యులకు మించరాదు. ప్రదర్శనకు గరిష్ట కాలపరి మితి7 నిమిషాలు. భారత సంప్రదాయానికి అనుగుణంగా ఉండాలి. సిని మా పాటలు అనుమతించబడవు. వాయిద్య పరికరాలు అభ్యర్థులే తెచ్చు కోవాల్సి ఉంటుంది. గతంలో లైవ్ ప్రదర్శన చేసిన వారికి ప్రాధాన్యత.

● పెయింటింగ్

ఒక్కొక్కరు ఒక పెయింటింగ్ మాత్రమే సమర్పించాలి. ఎంట్రీ ఒరిజినల్ అయి ఉండాలి. పెయింటింగ్ ఏ3 సైజులో 90 నిమిషాల వ్యవధిలో పూర్తి చేయాలి. పెయింటింగ్ ఏదైనా నిర్దిష్ట సంస్థకు లేదా బ్రాండ్ పేరు ప్రాతినిధ్యం ఉండకూడదు. చిత్రలేఖనానికి సంబంధించిన శీర్షిక 20-30 పదాలు మించకూడదు. పెయింటింగ్ సామగ్రిని ఎవరికి వారే తెచ్చుకోవాలి.

● ఉపన్యాసం(హిందీ,ఇంగ్లీష్)

ఎంపిక చేసిన అంశంపై హిందీ లేదా ఇంగ్లీష్‌లో 3 నిమిషాలు మించకుండా మాట్లాడాలి.

● యువక్రితి(హస్తకళలు, వస్త్రాలు, వ్యవసాయ ఉత్పత్తి)

హస్తకళలు, వస్త్రాలు, వ్యవసాయ ఉత్పత్తి కేటగిరీల్లో తయారు చేసిన ఉత్పత్తులను ప్రదర్శనకు తీసుకురావాలి. ఇందులో ఎంపిక చేసిన వారు రాష్ట్ర స్థాయికి అర్హత సాధిస్తారు.

● సైన్స్ మేళా

యువత సైన్స్ అండ్ టెక్నాలజీలో తయారు చేసిన కొత్త ప్రాజెక్టులను ప్రదర్శనకు తీసుకురావాలి. వ్యక్తిగతం లేదా గ్రూప్‌గా పాల్గొనే అవకాశం ఉంది. ఇందులో ఎంపికైన ప్రాజెక్టును రాష్ట్రస్థాయికి పంపిస్తారు.

యువత సద్వినియోగం చేసుకోవాలి

- కోరుకంటి రవి కుమార్, జిల్లా యువజన, క్రీడాభివృద్ధి అధికారి

జిల్లా స్థాయి యువజన కళాకారుల ఎంపిక వేదికను యువత సద్విని యోగం చేసుకోవాలి. జిల్లా స్థాయిలో అర్హత సాధించిన ప్రథములను రాష్ట్ర స్థాయికి, అక్కడ విజేతలుగా నిలిచిన వారిని జాతీయ స్థాయికి పంపిస్తారు. చదువుతో పాటు ఆటలు, కళారూపకంగా రాణిస్తున్న వారికి ఇది చక్కటి వేదిక.

జీవో 25ను రద్దు చేయాలి

జమ్మికుంట రూరల్ సెప్టెంబరు 22: రాష్ట్ర ప్రభుత్వం జీవో 25ను రద్దు చేసి ప్రాథమిక పాఠశాలలను రక్షించాలని డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఆవాల నరహరి డిమాండ్ చేశారు. జమ్మికుంట పట్టణంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ జీవో 25ను తీసుకువచ్చి పాఠశాల ఉపాధ్యాయులను సర్దుబాలు ప్రక్రియ మొదలు పెట్టిందన్నారు. జీవో ప్రకారం 1నుంచి10 మంది పిల్లలు ఉంటే ఒక ఉపాధ్యాయుడు 11-60కి ఇద్దరు, 61-90కి ముగ్గురు, 91-120 నలుగురు, 121-150 ఐదుగురు ఉపాధ్యాయులు పనిచేయాల్సి ఉంటుందన్నారు. 60మంది పిల్లలు ఉంటే ఇద్దరు ఉపాధ్యాయులు పని చేయాలంటే ఎలా సాధ్యమవుతుందని అన్నారు. కార్యక్రమంలో ఏబూషి శ్రీనివాస్, సదానందం, సంపత్, ఉమ, ఎం శ్రీనివాస్, బలరాం, కనకం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ కాలేజికి మృతదేహం అప్పగింత

వీణవంక, సెప్టెంబర్ 22: మండలంలోని కొండపాక గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ అవాల మణెమ్మ (80) అనారోగ్యంతో మృతి చెందింది. 2014లో కొండపాక ఎంపీటీసీగా పని చేసింది.క 'టుంబ సభ్యులు మణెమ్మ కోరిక మేరకు అర్‌వీఎం మెడికల్ కళాశాలకు అప్పగించారు. మణెమ్మ కుటుంబసభ్యులను ఎంపీ ఈటల రాజేందర్ ఫోన్‌లో పరామర్శించారు. పలువురు నాయకులు మృతదేహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు.

పిడుగుపాటుకు గేదె మృతి



మృతి చెందిన గేదె వద్ద రైతు

తిమ్మాపూర్, సెప్టెంబరు 22: మండలంలోని రామకృష్ణ కాలనీ గ్రామంలో ఆదివారం పిడుగుపడి అలువాల గంగయ్య అనే రైతుకు చెందిన గేదె మృతి చెందింది. మృతి చెందిన గేదె సుమారు 70వేల రూపాయల విలువ ఉంటుందని ప్రభుత్వం తనను అదుకోవాలని రైతు గంగయ్య విజ్ఞప్తి చేస్తున్నాడు.

క్షమాభిక్షతో అక్రమ వలసదారులకు ఊరట

- జరిమానా రద్దుచేసిన యూఏఈ - 22రోజుల్లో అవుట్ పాస్‌పోర్ట్‌కోసం వేలాది దరఖాస్తులు
- భారత రాయబార కార్యాలయాల వద్ద పెరిగిన రద్దీ



సిరిసిల్ల క్రైం, సెప్టెంబరు 22: యూనైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ)లో ఇటీవల ప్రకటించిన క్షమాభిక్షతో అక్రమ వలసదారులకు ఊరట లభించింది. ఈ సందర్భంగా యూఏఈని అక్రమవలస దారులకు విధించే జరిమానాను రద్దు చేసింది. ఈనెల 1నుంచి అమ్నెస్టీ ప్రకటించిన 22రోజుల్లో దాదాపు 20 వేలకు పైగా అక్రమవలసదారులు అవుట్‌పాస్‌పోర్ట్ కోసం దరఖాస్తు చేశారని జనరల్ డైరెక్టరేట్ ఆఫ్ రెసిడెన్సీ అండ్ ఫారిన్ ఎఫైర్స్(జీడీఎఫ్‌ఆర్‌ఏ) వెల్లడించింది. దీంతో దుబాయ్‌లోని భారత రాయబార కార్యాలయాల వద్ద రద్దీ పెరిగింది. ఇప్పటికే అనేకమంది అవుట్‌పాస్ పోర్ట్ తీసుకొని ప్రవాస తెలంగాణ కార్మికులు దుబాయ్‌నుంచి తిరుగుముఖం పడుతున్నారు.

● 20వేల మంది..

దుబాయ్‌లో తెలంగాణకు చెందిన దాదాపు 20 వేలమంది అక్రమ వలసదారులు ఉండవచ్చని భారత రాయబార కార్యాలయం అంచనా వేసింది. ఇందులో సిరిసిల్ల, వేములవాడ, జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి, నిజామాబాద్, ఆర్మూర్, నిర్మల్, కామారెడ్డి, అదిలాబాద్, మెదక్ తదితర ప్రాంతాలకు చెందిన కార్మికులు ఎక్కువగా ఉంటారు. కేవలం ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన దాదాపు అయిదువేల మంది కార్మికులు వీసా లేకుండా చాటుమాటుగా పనులు చూసుకుంటూ కాలం గడుపుతున్నారు. క్షమాభిక్ష కారణంగా అక్రమ వలసదారులకు ఎంతో ప్రయోజనం చేకూరనుంది. అయిదేళ్ల తర్వాత యూఏఈ ప్రభుత్వం మళ్లీ అవకాశం కల్పించింది. ఈసారి గడువు రెండు నెలలు ఇవ్వడంతో అనేకమంది తిరిగి వచ్చే అవకాశం ఉంది.

● టికెట్ కోసం కార్మికుల ఆశలు...

దుబాయ్‌లో అక్రమంగా ఉంటున్న వలస కార్మికులకు టికెట్‌కు డబ్బులు లేక తిరిగి వచ్చేందుకు ప్రభుత్వంపై ఆశలు పెట్టుకున్నారు. అక్రమంగా ఉంటున్న ప్రవాస కార్మికులందరికీ టికెట్‌లు స్పాన్సర్ చేయాలని దుబాయ్‌లోని గల్ఫ్ కార్మికులు కోరుతున్నారు. అక్రమవలసదారులు ఎమర్జెన్సీ సర్టిఫికెట్ కోసం 60 దిర్హామ్‌లు, సర్వీస్ ఫీజు 9 దిర్హామ్‌లు చెల్లించనవసరం లేదని ఇండియన్ కౌన్సులేట్ జనరల్ ఇప్పటికే ప్రకటించింది. దీంతో అక్రమ వలసదారులకు కొంత భారం తగ్గినట్లయింది. ఇదేవిధంగా తిరిగి రావడానికి అయ్యే విమాన ఖర్చులను చెల్లించాలని దుబాయ్‌లోని పలు యూనియన్‌లు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతున్నాయి. ఇప్పటివరకు అనేకమంది అక్రమ వలసదారులు వారి కుటుంబసభ్యుల ద్వారా దుబాయ్‌లో ఉండే స్నేహితులకు డబ్బులు పంపించి టికెట్ తీసుకుంటున్నారు. టికెట్‌కు డబ్బులు పంపించలేని కార్మికులకు టికెట్ ఇప్పిస్తారని ప్రభుత్వంపై ఆశలు పెట్టుకున్నారు.

జిల్లా స్థాయి కబడ్డీ టోర్నమెంట్ ఎంపికలు

హుజూరాబాద్, సెప్టెంబరు 22: ఈ నెల 23, 24న జిల్లా స్థాయి కబడ్డీ టోర్నమెంట్ సెలక్షన్స్ హుజూరాబాద్ పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్నట్లు ఎంఈవో శ్రీనివాస్‌రెడ్డి, టోర్నమెంట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ సొల్లు సారయ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 23న అండర్-17 బాలబాలికలు, 24న అండర్-14 బాలబాలికలకు కబడ్డీ సెలక్షన్స్ జరుగుతాయని పేర్కొన్నారు. పాల్గొనే క్రీడాకారులు మండల కబడ్డీ జట్లు ప్రారంభ కార్యక్రమానికి తప్పకుండా హాజరు కావాలని తెలిపారు. ప్రతి టీమ్ కూడా వారి మండల ఫ్లాగ్, అర్హత ఫామ్, ఆధార్‌కార్డు జిరాక్స్ జతచేసి ఉదయం 9గంటలకు హుజూరాబాద్ హైస్కూల్ గ్రౌండ్‌లో హాజరు కావాలని కోరారు.

ఊర చెరువును మినీ ట్యాంక్‌బండ్‌గా తీర్చిదిద్దాలి



సమావేశంలో మాట్లాడుతున్న పుల్లెల జగన్మోహన్

గన్నేరువరం, సెప్టెంబరు 22: మండల కేంద్రంలోని ఊర చెరువును మినీ ట్యాంక్‌బండ్‌గా అభివృద్ధి చేయాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పుల్లెల జగన్మోహన్ డిమాండ్ చేశారు. ఆదివారం గ్రామస్థులతో కలిసి చెరువు వద్ద మీడియాతో మాట్లాడారు. గన్నేరువరం చెరువు ఏళ్ల తరబడి ఎలాంటి అభివృద్ధికి నోచుకోలేదన్నారు. చెరువు పక్కనే మానేరు డ్యాం, గుట్టలు, ప్రకృతివనం ఆహ్లాదకరంగా ఉన్నప్పటికీ చెరువు కట్ట అభివృద్ధికి నోచుకోవడం లేదన్నారు. కట్టపై పిచ్చి మొక్కలతో నిండి వాహనాల ప్రయాణానికి సైతం ఇరుకుగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ చొరవచూపి చెరువును మినీ ట్యాంక్‌బండ్‌గా తీర్చిదిద్దాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు కాంతాల అంజిరెడ్డి, పుల్లెల రాము, కొట్టె భూమయ్య, ఐలయ్య, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ లైన్‌పై విరిగిపడ్డ హైమాస్ట్ లైట్ల స్తంభం

● నిలిచిపోయిన విద్యుత్

శంకరపట్నం, సెప్టెంబరు 22: శంకరపట్నం మండలం ముత్తారం గ్రామంలో విద్యుత్ ఎల్టీ లైన్‌పై హైమాస్ట్ లైట్ల స్తంభం విరిగిపడడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. ముత్తారం రామాలయం వెనుక హైమాస్ట్ లైట్ల కోసం ఏర్పాటు చేసిన స్తంభం ఆదివారం రాత్రి వీచిన గాలికి ఆకస్మాత్తుగా విరిగి విద్యుత్ లైన్‌పై పడిపోయింది. దీంతో కన్నాపూర్ సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలకు సుమారు గంటన్నర పాటు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. సమాచారం అందుకున్న విద్యుత్ సిబ్బంది విరిగిపడ్డ స్తంభాన్ని తొలగించి విద్యుత్ లైన్ పునరుద్ధరించి తిరిగి సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలకు విద్యుత్ సరఫరా పునరుద్ధరించారు.

మున్సిపల్ అధికారుల దాడులు

- ప్లాస్టిక్ కవర్ల స్వాధీనం.. జరిమానాల విధింపు



పరిశీలిస్తున్న మున్సిపల్ అధికారులు

కోరుట్ల, సెప్టెంబరు 22: పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న చికెన్, మటన్ దుకాణాల్లో మున్సిపల్ అధికారులు ఆదివారం సోదాలను నిర్వహించారు. దుకాణాల్లో ఉన్న ప్లాస్టిక్ నిల్వను స్వాధీనం చేసుకుని జరిమానా విధించారు. ప్లాస్టిక్ కవర్లు వాడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను స్వాధీనం చేసుకుని ప్రతీ దుకాణదారులకు రూ. 2500 జరిమాన విధించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ తిరుపతి మాట్లాడారు. ప్రభుత్వ నిబంధనలు పాటించని యజమానులపై చట్టపరమైన చర్యలు తప్పవని అన్నారు. కొనుగోలుకు వచ్చే వినియోగదారులు బట్ట సంచులతో రావాలని సూచించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ బాలే అశోక్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఇప్పపల్లి-పోతారం అడవుల్లో సరిహద్దు వివాదం

- ఎటూ తేల్చని అటవీ, రెవెన్యూ శాఖలు
- ఏడాది కాలంగా గొడవలు
- నిత్యం యంత్రాలతో యథేచ్ఛగా అడవి ధ్వంసం


ధ్వంసమైన అడవిలో చదును చేసిన స్థలం

కథలాపూర్, సెప్టెంబరు 22: మండలంలోని ఇప్పపల్లి - పోతారం అటవీ, రెవెన్యూ సరిహద్దు వివాదం రోజురోజుకూ రాజుకుంటోంది. ఈ క్రమంలో అడవి నిత్యం విచ్చలవిడిగా నరికివేతకు గురవుతున్నా రెండు శాఖలు నిమ్మకు నీరెత్తిన చందంగా వ్యవహరిస్తున్నాయనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ భూమి తమకే చెందుతుందని శివారు మాదేనని ఇరు గ్రామాల ప్రజలు అడవి తల్లిపై గొడ్డలి వేటు వేస్తున్న నేపథ్యంలో వందలాది ఎకరాలు ధ్వంసానికి గురవుతున్నాయి.

- రాత్రి, పగలు తేడా లేకుండా..

రాత్రి, పగలు యథేచ్ఛగా యంత్రాలతో భూమిని చదును చేస్తుండగా అటవీ శాఖ కళ్లుండీ చూడలేక పోతోందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పోటా పోటీగా రెండు గ్రామాలకు చెందిన వ్యక్తులు పోడుకు ప్రయత్నిస్తూ ఒకరిపైనొకరు అటవీ శాఖ కు ఫిర్యాదులు చేసుకోవడం సర్వసాధారణంగా మారిపోయింది. ఇప్పటికే ఏడాది కాలంగా అడవుల ధ్వంసంపై గొడవలు జరుగుతుండగా పోలీసు యంత్రాంగం పలుమార్లు సంఘటనా స్థలం వద్దకు చేరుకుని ఇరువర్గాలకు సముదాయించిన ఘటనలు కూడా ఉన్నాయి. పోతారానికి చెందిన ఓ సామాజిక వర్గం తమకు శ్మశాన వాటికకు స్థలం కావాలంటూ చెట్లను ఇబ్బడిముబ్బడిగా నరికివేస్తుండగా ఇప్పపల్లి వాసులు అడ్డుకుంటున్నారు. ఈ శివారు తమకే వర్తిస్తుందని అడవిని కాపాడుకుంటామని అటవీశాఖకు చెందిన అధికారులతో ఇటీవల వాదించారు. గడిచిన ఏడాది కిందట ఇప్పపల్లి వాసులు అడవిని యం త్రాలతో ధ్వంసం చేశారని పేర్కొంటూ అటవీ శాఖ అధికారులు రు 2 లక్షల జరిమానా విధించారు. వారం రోజుల కిందట అటవీశాఖ ఉన్నతాధికారులు ఇప్పపల్లిలో సమా వేశం ఏర్పాటు చేయగా అటవీ, రెవెన్యూ సరిహ ద్దులు తేల్చాలని డిమాండ్ చేశారు. అయితే రెవెన్యూ, అటవీ శాఖల సమన్వయం లేకపోవడం వల్ల సరిహద్దు వివాదం చిలికి చిలికి గాలివానలా మారిందనే ఆరోపణలు వస్తున్నాయి. ఈ కారణంగానే భారీ విస్తీర్ణంలో అడ వి ధ్వంసం కాబడిందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.


నరికి వేసిన చెట్లు

బీసీ కులగణన తర్వాతే స్థానిక ఎన్నికలు నిర్వహించాలి

- బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ఎన్నం ప్రకాష్


మాట్లాడుతున్న ఎన్నం ప్రకాష్

గణేశ్‌నగర్, సెప్టెంబరు 22: బీసీ కుల గణన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని బీసీ సంక్షేమ సంఘం ఉమ్మ డి జిల్లా అధ్యక్షుడు ఎన్నం ప్రకాష్ డిమాండ్ చేశారు. ఆదివారం కరీంనగర్‌లోని పద్మావతి కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 25న హైదరాబాద్‌లో సుందరయ్య పార్క్ నుంచి ఇందిరాపార్క్ వరకు తలపెట్టిన కులగణన మార్చ్‌ను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. హైకోర్టు తీర్పుతో నైనా రాష్ట్ర ప్రభుత్వం వెంటనే కుల గణనను ప్రారంభించడానికి రోడ్ మ్యాప్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. వెంటనే కుల గణనను చేపట్టి స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రంగు సంపత్ గౌడ్, రాష్ట్ర ఉపాధ్యక్షులు గీకురు రవీందర్, రాష్ట్ర కార్యదర్శి కోడూరి పరుశురామ్ గౌడ్, రాష్ట్ర ప్రచార కార్యదర్శి జి ఎస్ ఆనంద్, బీసీ విద్యార్థి సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు నారోజురాకేశ్‌చారి, కనకయ్య గౌడ్, రాచమల్ల రాజు,దొగ్గలి శ్రీధర్, పెంట శ్రీనివాస్, ఎడ్ల సురేందర్, వంగల రవి గోపాల్, మాచర్ల అంజయ్య గౌడ్, మాదాసు సంజీవ్, కాయితోజు బ్రహ్మచారి, సుధాగోణి గణేశ్‌గౌడ్, బియ్యాని తిరుపతి, తాళ్లపల్లి మహేష్, తదితరులు పాల్గొన్నారు.


ఓసీపీ-5 పీఎల్ఆర్ కంపెనీ నుంచి తరలివెళుతున్న స్థానికేతరులు

రామగుండంలో 'స్థానిక' వివాదం

- ఓపెన్‌కాస్టు నుంచి తరలివెళ్లిన స్థానికేతరులు
- రెండు ఓబీ కంపెనీల్లో వెయ్యి మందికి ఉపాధి అవకాశాలు

గోదావరిఖని, సెప్టెంబరు 22: రామగుండంలో స్థానిక నినాదం భగ్గుమన్నది. ఆర్‌జీ-1 పరిధిలోని రామగుండం నియోజకవర్గ పరిధిలోని ఓసీపీ-5, ఓసీపీ-3 రెండు ఓపెన్‌కాస్టుల్లో ఓబీ కాంట్రాక్టర్ల వద్ద 1200మంది కార్మికులు పనిచేస్తారు. ఇందులో 80శాతం స్థానికేతరులే ఉంటారు. వీరంతా ఒరిస్సా, బీహార్, మహారాష్ట్ర తదితర ప్రాంతాల నుంచి ఈ కాంట్రాక్టు కంపెనీల్లో పనిచేస్తుంటారు. ఓబీ పనుల్లో వోల్వో డ్రైవర్లుగా, టెక్నీషియన్లుగా ఇతర రాష్ట్రాల నుంచి ఉద్యోగులను తీసుకువచ్చి ఓపెన్‌కాస్టులపైనే ఓబీ కంపెనీలు గుడారాలు వేసి పని చేయిస్తుంటారు. పని స్థలాల్లో వీరు ఉండడం వల్ల పూర్తి పని సమయాల్లో కాంట్రాక్టర్లు వాడుకుంటారు. జీతాల చెల్లింపుల్లో కూడా ఓబీ కాంట్రాక్టర్లకు ప్రయోజనం ఉంటుంది. ఇది ఎన్నో ఏళ్లుగా జరుగుతున్న ప్రక్రియ, మార్పు అంటూ అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం తాను గెలిస్తే ఇక్కడ పరిశ్రమల్లో స్థానికులకు ఉపాధి పెంచుతామని రామగుండం ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ మక్కాన్‌సింగ్ చెప్పిన విధంగానే ఇప్పుడు ఆచరణ మొదలైంది. నెల రోజుల క్రితం ఓసీపీ-3 ప్రాజెక్టులో ఆర్‌వీఆర్ కంపెనీ ఓబీ కాంట్రాక్టర్ దగ్గర 600మంది పని చేస్తుంటారు. ఇందులో 500మంది స్థానికేతరులే. స్థానికులనే ఉద్యోగాల్లోకి తీసుకోవాలని, లేకుంటే పని బంద్ చేయాలని ఎమ్మెల్యే ఆదేశాలతో 25రోజులు గత నెలలో ఆర్‌వీఆర్ ఓసీపీలో పనులు బంద్ అయ్యాయి. చివరికి 80మంది స్థానికులనే ఉద్యోగాల్లో తీసుకుంటామని, కార్మిక చట్టాల జీవో అమలుచేస్తామని హామీ ఇవ్వడంతో తిరిగి ఆర్‌వీఆర్ పనులు కొనసాగుతున్నాయి. ఈ స్ఫూర్తితో వారంరోజుల క్రితం స్థానిక కాంగ్రెస్ పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులు, నాయకులు ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ సూచన మేరకు ఓసీపీ-5లోని పీసీ పటేల్ ఓబీ కాంట్రాక్టు పనులను కూడా బంద్ చేయించారు. ఈ అంశం డైరెక్టర్లు, సీఎండీ వరకు వెళ్లింది. గత్యంతరం లేని పరిస్థితుల్లో ఓసీపీ-5లో కూడా 80శాతం మంది స్థానికులనే ఉద్యోగులుగా తీసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో పీసీ పటేల్ కంపెనీలో పని చేసే సుమారు 600మంది స్థానికేతర కార్మికులు ఆదివారం తమ తమ ఊళ్లకు వెళ్లిపోయారు. దీంతో ఓసీపీ-5 పీసీ పటేల్ కంపెనీలో, ఓసీపీ-3 ఆర్‌వీఆర్ ఓబీ కంపెనీలో సుమారు 1000మంది స్థానికులకు ఉద్యోగాలు లభించే అవకాశం ఏర్పడింది. ఈ పరిణామం పట్ల స్థానిక నిరుద్యోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

బెంబేలెత్తిస్తున్న కుక్కలు

- గుంపులుగా వీధుల్లో సంచారం
- ప్రజలు, మూగజీవాలపై దాడులు
- అధికారులు చర్యలు తీసుకోవాలని వినతి

సిరిసిల్ల రూరల్, సెప్టెంబరు 22: వీధికుక్కల దాడుల వరుస సంఘటనలతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. కొన్ని రోజులుగా ప్రతిరోజూ ఏదో ఒక చోట వీధి కుక్కలు పిల్లలు, పెద్దలు, మహిళలపై దాడుల చేసి తీవ్రంగా గాయపరుచడంతో ప్రజలు తీవ్రభయాందోళనకు గురవుతున్నారు. సిరిసిల్ల అర్బన్ పరిధిలోని చంద్రంపేట, పెద్దూర్, సర్ధాపూర్, రగుడు, చిన్నబోనాల, ముష్టిపల్లి, రాజీవ్‌నగర్, పెద్దబోనాల, దూప్యానాయక్ తండా, తుర్కాకాశీ పల్లె, జగ్గారావుపల్లె, మాలపల్లె, బాబాజీ కాలనీ, ఇప్పలపల్లెలో కుక్కలు చెలరేగిపోతున్నాయి. దీంతో ఇళ్లలో నుంచి బయటకు రావడానికి మహిళలు, చిన్న పిల్లలు భయపడుతున్నారు. మూగజీవాలకు కూడా రక్షణ లేకుండా పోయింది. వీధుల్లో పగలు, రాత్రి అనే తేడా లేకుండా కుక్కలు గుంపులుగా తిరుగుతున్నాయి. ఇటీవల పెద్దూర్‌లోని పలువురు చిన్న పిల్లలపై దాడి చేసి గాయపర్చాయి. ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.


సిరిసిల్ల జిల్లా పెద్దూర్‌లో గుంపులుగా తిరుగుతున్న కుక్కలు



కుక్కలతో అవస్థలు..

పెద్దూర్‌లో కుక్కలు స్వైర విహారం చేస్తుండడంతో అవస్థలు పడుతున్నాం. ప్రజలపై దాడులు చేస్తున్నాయి. మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు. జనం వీధుల్లో తిరగలేని పరిస్థితి నెలకొంది. ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలి.

- ఉలిసె తిరుపతి, పెద్దూర్



జనం భయపడుతున్నారు..

రోడ్లపై కుక్కల గుంపులతో గ్రామాల్లో జనం భయపడుతున్నారు. కుక్కల దాడితో చాలా మంది గాయపడుతున్నారు. బయటకు రావాడానికి జనం వణికిపోతున్నారు. అధికారులు స్పందించి కుక్కల బెడదను నివారించేందుకు చర్యలు తీసుకోవాలి.

- జీలకిషన్‌యాదవ్, సింగిల్ విండో చైర్మన్

దాడి చేయడంతో మనస్తాపం ఉరివేసుకొని యువకుడి ఆత్మహత్య

చందుర్తి సెప్టెంబరు 22: చందుర్తి మండలం నర్సింగాపూర్‌కు చెందిన సూత్రం ఆంజనేయులు (22) అనే యువకుడు ఆదివారం ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. నర్సింగాపూర్‌కు చెందిన ఆంజనేయులు తమ కుటుంబ అంతర్గత విషయాల్లో జోక్య చేసుకోవద్దని అదే గ్రామానికి చెందిన ఆరుగురు దాడి చేశారు. దీంతో మనస్తాపం చెంది ఆదివారం తెల్లవారుజామున ఇంట్లో రేకుల షెడ్డుకు ఉరేసుకున్నాడు. ఆంజనేయుఉల తల్లి రాజవ్వ ఫిర్యాదుతో ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై బాబు తెలిపారు.

కుక్కలు అడ్డురావడంతో అదుపుతప్పిన బైక్ ఇద్దరికి గాయాలు

రుద్రంగి, సెప్టెంబరు 22: మండల కేంద్రంలో ఆదివారం బైక్ అదుపుతప్పి ఇద్దరికి గాయాలయ్యాయి. కథలాపూర్ మండలం కలికోటకు చెందిన దేవరాజం ద్విచక్ర వాహనంపై చందుర్తి మండలం మల్యాల నుంచి స్వగ్రామానికి వెళ్తున్నాడు. రుద్రంగిలోని ఇందిరాచౌక్ వద్ద కుక్కల గుంపు బైక్ వైపు రావడంతో అదుపుతప్పి కింద ఎడ్డాడు. దేవరాజం కాలు విరిగింది. బైక్ వెనకాల కూర్చున్న మహిళకు గాయాలయ్యాయి. స్థానికులు గమనించి వేములవాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

దేవుడి సొమ్ము విక్రయించే యత్నం

- స్థానికులు పట్టుకుని పోలీసులకు అప్పగింత

కోల్‌సిటీ, సెప్టెంబరు 22: రామగుండం విద్యుత్‌నగర్‌లో హనుమాన్ టెంపుల్‌లో కిలోకుపైగా వెండి ఆభరణాలు చోరీ చేసి ఆ సొత్తును గోదావరిఖని స్వర్ణకారులకు విక్రయించేందుకు ప్రయత్నిస్తుండగా ఆదివారం స్వర్ణకారులు ఇచ్చిన సమాచారంతో రామగుండం వాసులు పట్టుకున్నారు. ఈ ఘటనకు సంబంధించిన వివరాలు... రామగుండం విద్యుత్‌నగర్‌లోని హనుమాన్‌దేవాలయంలో రెండు రోజుల క్రితం చోరీ జరిగింది. దేవునికి అలంకరించిన కిలో వెండివస్తువులు, కొంత బంగారాన్ని గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. ఆదివారం గోదావరిఖని లక్ష్మీనగర్‌లోని ఒక స్వర్ణకారుడిని సంప్రదించిన దొంగలు తాము వెండి వస్తువులు తీసుకువస్తామని చెప్పారు. చోరీ జరిగిన సమాచారం ఉన్న సదరు స్వర్ణకారుడు రామగుండంలోని అతని సోదరునికి సమాచారం ఇచ్చారు. దీంతో ఆలయ పూజారితో పాటు కాలనీవాసులు ఆదివారం లక్ష్మీనగర్‌లో కాపుకాశారు. సదరు దొంగ ఆభరణాలతో రాగానే పట్టుకున్నారు. అతడిని గోదావరిఖని వన్‌టౌన్ పోలీసులకు అప్పగించారు.

నామాపూర్‌లో గంజాయి పట్టివేత

- ముగ్గురి అరెస్టు

పెగడపల్లి, సెప్టెంబరు 22: మండలంలోని నామాపూర్ గ్రామ శివారులో ఆదివారం గంజాయి సేవిస్తున్న ముగ్గురిని పట్టుకుని కేసు నమోదు చేసినట్లు పెగడపల్లి ఎస్ఐ రవికిరణ్ తెలిపారు. నామాపూర్ గ్రామ శివారులోని నిర్మానుష్య ప్రదేశంలో గంజాయి సేవిస్తున్నట్లు అందిన సమాచారం మేరకు పోలీస్ సిబ్బంది తిరుపతి, రాజేష్, సంపత్, ఎల్లయ్యలు ఒక బృందంగా ఏర్పడి గంజాయి సేవిస్తున్న తోడేటి వెంకటేష్ ధర్మపురి మండలం తిమ్మాపూర్, బుగ్గారం మండలంలోని సిరికొండ గ్రామానికి చెందిన లింగాల వంశీ, చొప్పదండి మండలం భూపాలపట్నం గ్రామానికి చెందిన గుండేటి ప్రవీణ్‌లను పట్టుకున్నారు. వారి వద్ద నుంచి 500 గ్రాములు గంజాయితో పాటు మూడు సెల్‌ఫోన్‌లు, రెండు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసుకున్నట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించనున్నట్లు ఎస్ఐ రవికిరణ్ తెలిపారు. గంజాయి విక్రయించినా, సేవించినా చట్ట ప్రకారం చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

నాటుబాంబుల తయారీ ముఠా అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న సీఐ వెంకటేశ్వర్లు

కోనరావుపేట, సెప్టెంబరు 22: నాటుబాంబుల తయారీ ముఠాను పోలీసులు అరెస్టు చేసినట్లు చందుర్తి సీఐ వెంకటేశ్వర్లు తెలిపారు. కోనరావుపేట పోలీస్ స్టేషన్‌లో ఆదివారం వివరాలను వెల్లడించారు. కోనరావుపేట మండలం ధర్మారం గ్రామానికి చెందిన ముడిక మల్లయ్యకు చెందిన గేదె మేత మేస్తూ గడ్డిలో ఉన్న నాటుబాంబును కొరకడంతో తీవ్ర గాయాలయ్యాయి. బాధిత రైతు ఫిర్యాదుతో కేసు దర్యాప్తు ప్రారంభించారు. ఈ క్రమంలో ధర్మారం గ్రామానికి చెందిన పిట్టల రాజలింగం, బోనాలకు చెందిన తుమ్మల కనకరాజు, పడగల లక్ష్మీరాజం నాటు బాంబులను తయారు చేస్తూ అడవి జంతువులను వేటాడుతున్నట్లు తేలింది. వారి వద్ద 27 నాటు బాంబులను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. పిట్టల రాజలింగంను గతంలో రిమాండ్ పంపినట్లు సీఐ తెలిపారు. సమావేశంలో కోనరావుపేట ఎస్సై రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

కొడుకుకు గడ్డిమందు తాగిచ్చి హత్యాయత్నం

- వివాహేతర సంబంధం బయటపడుతుందని ప్రియుడితో కలిసి ఘాతుకం

మెట్‌పల్లి రూరల్, సెప్టెంబరు 22: జగిత్యాల జిల్లా మెట్‌పల్లి రూరల్ మండలంలోని జగ్గసాగర్ గ్రామంలో ఓ తల్లి తన వివాహేతర సంబంధం బయటపడుతుందని ప్రియుడితో కలిసి కన్న కొడుకుకు గడ్డి మందు ఇచ్చి చంపాలని చూసింది. ఈ ఘటన 20 రోజుల క్రితం జరగగా దుబాయిలో ఉన్న తండ్రికి విషయం తెలియడంతో స్వగ్రామానికి చేరుకుని మెట్‌పల్లి పోలీసుస్టేషన్‌లో ఆదివారం ఫిర్యాదు చేయడంతో వెలుగులోకి వచ్చింది. జగ్గసాగర్ గ్రామంలో ఉంటున్న ఓ వ్యక్తి జీవనోపాధి నిమిత్తం కొన్నేళ్ల క్రితం గల్ఫ్ వెళ్లాడు. అతని భార్య, కుమారుడు గ్రామంలో ఉంటున్నారు. గ్రామంలోని మరో వ్యక్తితో సదరు మహిళ కొన్నేళ్లుగా వివాహేతర సంబంధం కొనసాగిస్తోంది. ప్రియుడితో మహిళ కలిసి ఉండటాన్ని కుమారుడు ఒకరోజు చూసాడు. దీంతో తన బండారం బయటపడుతుందని కొడుకును అడ్డు తొలగించుకోవాలని ఆమె నిర్ణయించుకుంది. వివాహేతర సంబంధం పెట్టుకున్న వ్యక్తితో కలిసి మహిళ తన కొడుకుకు ఈనెల 2వ తేదీన బలవంతంగా గడ్డి మందు తాగించింది. అనుమానం రాకుండా ఉండేందుకు ఆరోగ్యం బాగా లేదని గ్రామంలోని ఆర్ ఎంపీతో మూడు రోజులు చికిత్స చేయించింది. పరిస్థితి విషమించడంతో మెట్‌పల్లిలోని ఆసుపత్రికి తరలించింది. వైద్యులు పరీక్షలు చేసిన అనంతరం మెరుగైన చికిత్స కోసం నిజామాబాద్‌కు తరలించాలని సూచించారు. ప్రస్తుతం నిజామాబాద్‌లో ప్రాణాపాయ స్థితిలో యువకుడు చికిత్స పొందుతున్నాడు. ఈ విషయం తెలుసుకున్న యువకుడి తండ్రి గల్ఫ్ నుంచి ఇటీవల వచ్చి అసలు విషయం ఏంటని ఆరా తీశాడు. భార్య విషయం బయటపడడంతో ఆదివారం మెట్‌పల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దరాప్తు చేస్తున్నారు.

గోదావరిలో మృతదేహం లభ్యం

ఫైటింక్లయిన్‌కాలనీ, సెప్టెంబరు 22: గోదావరినదిలో ఆదివారం సాయంత్రం ఓ వ్యక్తి మృతదేహం లభించినట్టు గోదావరిఖని టుటౌన్ పోలీసులు తెలిపారు. మృతుడు మంచిర్యాల జిల్లాకు చెందిన సాటం వెంకటేష్(32)గా గుర్తించినట్టు పేర్కొన్నారు. మృతుడు మంచిర్యాలటౌన్‌లో ఇంటర్‌నెట్ షాపు నడుపుకుంటూ జీవిస్తుంటాడని, ఓ హత్య కేసులో జైలుకు వెళ్లి వారం రోజుల క్రితం కండిషన్ బెయిల్‌పై వచ్చిన అతడు నదిలో మృతదేహంగా మారినట్టు తెలిపారు. వెంకటేష్ ఆత్మహత్య చేసుకున్నాడా లేక ఎవరైనా హత్య చేసి ఉంటారా అనేది తేలాల్సి ఉందని, ఈ విషయంపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదన్నారు. మృతుడి బంధువుల్లో ఒకరు మృతదేహాన్ని చూసి వెంకటేష్‌గా గుర్తించారన్నారు.

ఇళ్ల చుట్టూ ఎస్సారెస్పీ కెనాల్ నీళ్లు


ఇంటి చుట్టూ చేరిన కెనాల్ నీళ్లు

మంథనిరూరల్, సెప్టెంబరు 22: మండలంలోని కన్నాల గ్రామంలో ఎస్సారెస్పీ కెనాల్ నీళ్ల ఇళ్ల చుట్టూ వచ్చి చేరడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కాలువలో పూడిక పూడిక పెరుకుపోవడంతో నీళ్లు ఇళ్ల మధ్యకు వస్తున్నాయి. జంగిలి బుజ్జమ్మ, జంగిలి రాధమ్మతో పాటు పలువురి ఇళ్లల్లోకి నీరు రావడంతో ఇబ్బందులు పడుతున్నారు.

డ్రైవర్ విధులకు ఆటంకం కలిగించిన ఆర్ఎంపీపై కేసు నమోదు

- ఆర్టీసీ బస్సు ఇంటి వద్ద ఆపలేదని వివాదం


పోలీస్‌స్టేషన్ ఎదుట నిలిపిన ఆర్టీసీ బస్సు

ఇల్లంతకుంట, సెప్టెంబరు 22: ఆర్టీసీ బస్సు డ్రైవర్ విధులకు ఆటంకం కలిగించిన మండల కేంద్రానికి చెందిన ఆర్ఎంపీ డాక్టర్ తాడూరి రాజేశంపై కేసునమోదు చేసినట్లు ఎస్సై శ్రీకాంత్‌గౌడ్ తెలిపారు. ఎస్సై వివరాల ప్రకారం కరీంనగర్ నుండి ఇల్లంతకుంట మీదుగా జేబీఎస్‌కు ఆదివారం బయలుదేరింది. ఇల్లంతకుంటలోని బస్టాండులో రాజేశం బస్సు ఎక్కి మార్గమధ్యలోని తన ఇంటివద్ద ఆపాలని కోరాడు. డ్రైవర్ ఇంటివద్ద కొంత సమయం బస్సును ఆపినా ఇంట్లోని వారు రాకపోవడంతో ప్రయాణీకులు ఇబ్బంది పడుతున్నారని డ్రైవర్ తెలిపాడు. దీనితో ఆవేశానికి లోనైన రాజేశం డ్రైవర్‌ను దుర్భాషలాడుతూ దాడి చేసేందుకు వెళ్లాడు. డ్రైవర్ ఆర్టీసీ బస్సును తీసుకొని నేరుగా పోలీస్‌స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేశాడు. డ్రైవర్ శెట్టి తిరుమలరాజు ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

రెస్టారెంట్‌లో అగ్నిప్రమాదం

కరీంనగర్ క్రైం, సెప్టెంబరు 22: కరీంనగర్‌లోని రాజీవ్ చౌక్ వద్ద న్యూ పీకాక్ రెస్టారెంట్‌లో ఆదివారం విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం జరిగింది. రెస్టారెంట్‌లోని కిచెన్‌లో చిమ్ని వద్ద పెద్దఎత్తున పొగలు రావడంతో సిబ్బంది వెంటనే కరీంనగర్ ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందించారు. దీంతో ఫైర్ సిబ్బంది వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. ఈ సంఘటనలో 2 లక్షల రూపాయలకు పైగా నష్టం వాటిల్లినట్టు కరీంనగర్ డివిజన్ ఫైర్ ఆఫీసర్ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. అగ్నిప్రమాద ఘటనపై విచారణ జరుపుతున్నామని ఆయన తెలిపారు.



మంటలను ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

బస్సులో రూ. 2 లక్షలు మర్చిపోయిన ప్రయాణికుడు

- అందజేసిన మంథని డీఎం శ్రావణ్‌కుమార్


రమేశ్‌కు డబ్బులు అందజేస్తున్న డీఎం శ్రావణ్‌కుమార్

మంథని, సెప్టెంబరు 22: ఆర్టీసి బస్సులో ప్రయాణికుడు మర్చిపోయిన రూ. 2 లక్షలను మంథని డీఎం శ్రావణ్‌కుమార్ ఆదివారం అప్పగించారు. మంథని డిపోకు చెందిన బస్సు గోదావరిఖని నుంచి భూపాలపల్లికి వెళ్తుండగా మార్గమధ్యలో కాటారంలో జే రమేశ్ అనే ప్రయాణికుడు ఎక్కాడు. ఈక్రమంలో తన వెంట ఉన్న కవర్‌లో రూ. 2 లక్షలను సీటులోనే ఉంచి మర్చిపోయి భూపాలపల్లిలో దిగిపోయాడు. డబ్బులను గమనించి భూపాలపల్లి డిపోలో సెక్యూరిటీ సిబ్బందిని కలిసి సమాచారం ఇచ్చారు. వారు మంథని డీఎంకు సమాచారం ఇవ్వడంతో బస్సును గుర్తించి కండక్టర్ ద్వారా సదురు నగదు ఉన్న కవర్‌ను గుర్తించి తమ స్వాధీనంలోకి తీసుకున్నారు. ఈమేరకు సమాచారం ఇవ్వడతో రమేశ్ మంథనికి వచ్చి తన రూ. 2 లక్షల నగదు కవర్‌ను డీఎం శ్రావణ్‌కుమార్ నుంచి స్వాధీనం చేసుకున్నారు. మర్చిపోయిన తన రూ. 2 లక్షలను తిరిగి క్షేమంగా అప్పగించిన డీఎం శ్రావణ్‌కుమార్, కండక్టర్ తిరుపతమ్మ, డ్రైవర్ మొగిలికి రమేశ్ కృతజ్ఞతలు తెలిపారు.

ఆదమరిస్తే అంతే..

- వల్లంపహాడ్, ఇరుకుల్ల బ్రిడ్జిలపై ప్రమాదకరంగా గుంతలు
- రాకపోకలకు వాహనదారులు అవస్థలు


ఇరుకుల్ల వంతెనపై తేలిన ఇనుప చువ్వలు

కరీంనగర్ రూరల్, సెప్టెంబరు 22: కరీంనగర్ శివారులోని ప్రధాన రహదారిపై రోడ్లు అధ్వాన్నంగా మారాయి. కరీంనగర్ మండల శివారులోని ప్రధాన రాజీవ్ రహదారిపై, కరీంనగర్ నుంచి మంచి ర్యాల ప్రధాన రహదారి వల్లంపహాడ్ బ్రిడ్జిపై రహదారి ప్రమాదకరంగా మారింది. ఇరుకుల్ల వంతెనపై పలు చోట్ల గుంతలు ఏర్పడి తరచూ ప్రవ రాదాలు జరుగుతున్నాయి. కరీంనగర్ నుంచి మంచిర్యాల వైపు వెళ్లే రహదా రిపై వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. వల్లంపహాడ్ బ్రిడ్జి మూల వద్ద ఏర్పడిన భారీ గుంత ప్రమాదాలకు నిలయంగా మారింది. రోడ్డు సేఫ్టీ అధికారులు పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వల్లంపహాడ్ బ్రిడ్జి బ్రిడ్జిపై, ఇరుకుల్ల బ్రిడ్జి రహదారిపై మరమ్మతులు చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.


రోడ్డు మధ్యలో ఏర్పడిన గుంత


వల్లపహాడ్ బ్రిడ్జిపై ప్రమాదకరంగా ఉన్న గుంత

ప్లాస్టిక్ నియంత్రణ ఆగేదెన్నడో..?

●అధికారుల దాడులకు ముందే నిర్వాహకులకు లీక్

●విచ్చలవిడిగా పాలిథిన్ కవర్ల వినియోగం

మెట్‌పల్లి, సెప్టెంబర్ 22 (ఇబ్రహీంపట్నం) : పట్టణంలో ప్లాస్టిక్ కవర్ల నిషేధం ఫైన్‌లకే పరిమితవుతుందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. మున్సిపల్ అధికారులు దాడులు చేసేకంటే ముందే సంబంధిత విభాగంలో పని చేస్తున్న సిబ్బంది నిర్వాహకులకు లీక్ చేయడంతో యజమానులు సర్దుకోవ డంతో దాడి సమయంలో ప్లాస్టిక్ దొరకకుండ జాగ్రత్త పడుతున్నట్లు తెలుస్తోంది. పట్టణంలోని పలు కిరాణ షాపులలో ప్లాస్టిక్ కవర్ల అమ్మకాలు విచ్చలవిడిగా జరుగుతున్నా సంబంధిత అధికారులు అటువైపు కన్నెత్తి చూడటం లేదనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. మున్సిపల్ అధికారులు అడపదడప దాడులు నిర్వహించి ఫైన్‌లు వేసి చేతులు దులుపుకుంటున్నారే తప్ప శాశ్వతంగా ప్లాస్టిక్‌ను నియంత్రించలేకపోతున్నారు. పట్టణంలో పాలిథిన్ కవర్ల వినియోగం పెద్ద మొత్తంలో జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలున్నాయి. మున్సిపల్ సిబ్బంది సేకరించే చెత్తలో పెద్ద ఎత్తున్న ప్లాస్టిక్ వ్యర్థాలే కినిపించడం ఇందుకు సాక్షం. అయితే 75 మైక్రాన్‌లకు మించి తయారైన కవర్లను, పేపర్ సంచులు, బట్ట సంచులను వాడాలని కేంద్రం సూచిస్తోంది. పాలిథిన్ కవర్ల వినియోగంతో భవిష్యత్ తరాలకు పెను ప్రమాదం పొంచి ఉందని క్యాన్సర్‌తో పాటు వివిధ ప్రమాదకార వ్యాధులు వస్తాయని విద్యావంతులు, నిపుణులు సూచిస్తున్నా ప్లాస్టిక్ వినియోగం తగ్గడం లేదు. ఫలితంగా ప్లాస్టిక్ వినియోగం విచ్చల విడిగా పెరిగిపోవడంతో పట్టణంలో, పల్లెలో ఉన్న మూగజీవాలు సైతం మృత్యువాత పడిన సంఘటనలు ఉన్నాయి. అధికారులు నామమాత్రంగా దాడులు నిర్వహించడంతో నిర్వాహకులు వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలు అన్న చందంగా సాగుతోంది. పట్టణంలోని ప్రతి కిరాణంలో ఈ తతంగం జరుగుతున్న అధికారులు మాత్రం చూసి చూడనట్లుగా వ్యవహరిస్తున్నారు. ఇప్పటికి హోటల్‌లలో, టీ కొట్టు, గ్లాసులు, కప్పులు, మార్కెట్‌లోని కూరగాయల అమ్మేవారు, మటన్, చికెన్ సెంటర్‌లలో సంచులు వినియోగిస్తున్నారు.

●ముందస్తు లీకేజీలు

పట్టణంలో వందల కొద్ది కిరాణ షాపులు ఉన్నాయి. అయితే ఇందులో పట్టణంలో ఇతర రాష్ట్రాల నుంచి ఇక్కడికి వచ్చి ప్లాస్టిక్ బిజినెస్ చేసే వారికి మున్సిపల్ అధికారులు దాడుల కంటే ముందుగానే మున్సిపల్‌లో పని చేసే ఓ ఉద్యోగి సమాచారం లీక్ చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. సదరు ఉద్యోగి నిత్యం వారితో సత్సంబంధాలు కొనసాగిస్తూ సంబంధిత వర్గానికి చెందిన యూనియన్ లీడర్‌కు సమాచారం ఇవ్వడంతో వ్యాపారులు అలర్ట్ అయి నిషేధిత ప్లాసిక్ దొరకకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

ఇప్పటికైన ఉన్నతాధికారులు దృష్టి సారించి పట్టణంలో ప్లాస్టిక్‌ను పూర్తిగా నియంత్రించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.



ప్లాస్టిక్‌ను నిషేధిస్తాం

మున్సిపల్ కమిషనర్ మోహన్



పట్టణంలో పూర్తిగా ప్లాస్టిక్ నిషేధిస్తాం. ప్లాస్టిక్ నియంత్రణ కోసం ఎప్పటికప్పుడు దాడులు నిర్వహిస్తూ ఫైన్‌లు విధిస్తున్నాం. షాపు యాజమానులు నిషేధిత ప్లాస్టిక్ కవర్లు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటాం.

సంక్షిప్తం సమాచారం

ధర్మపురి: ధర్మపురి శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానం హుండీ లెక్కింపు ఈ నెల 25న బుధవారం ఉదయం 9 గంటలకు ప్రారంభం అవుతుందని ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. అధికారులు, వ్యాపారులు, స్వచ్ఛంద సంస్థల సభ్యులు, సిబ్బంది, సహకారం అందించాలని కోరారు.

మెట్‌పల్లి (ఇబ్రహీంపట్నం): పట్టణంలోని త్రిశక్తి ఆలయంలో అదివారం దసరా ఉత్సవాలలో భాగంగా 14 మంది భక్తులు 41 రోజుల భవాని దీక్షలు స్వీకరించారు. ఆలయ ప్రధాన అర్చకులు జిహ్వా విధుమౌళి శర్మ ప్రత్యేక అర్చనలు, అభిషేకలు నిర్వహించి భవాని దీక్ష చేపట్టిన భక్తులకు దీక్ష మాలధరణ చేసి మంత్రోపదేశం చేశారు. దీక్ష స్వీకరిం చిన వారిలో అధ్యక్షులు ద్యావనపల్లి రాజారాం, నాయ కులు బేతు భాస్కర్, ద్యావనపల్లి గణేష్, నరేష్, కార్తీక్, సతీష్ పాల్గొన్నారు.

మెట్‌పల్లి(ఇబ్రహీంపట్నం): బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని బీజేపీ బూత్ స్థాయి నాయకులు వేగవంతం చేసి అధిక సంఖ్యలో బీజేపీ సభ్యత్వాలు నమోదు చేయాలని బీజేపీ పట్టణ అధ్యక్షులు బొడ్ల రమేష్ కోరారు. అదివారం పట్టణ అనుబంధ గ్రామమైన వెంకట్రావుపేట గ్రామంలో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు.

మల్లాపూర్ : మండలంలోని ఓబులాపూర్ మీదుగా ఖానాపూర్ వెళ్ల ప్రధాన రహదారి గుంతల మయం అయి ప్రమాదకరంగా మారింది. ఆదివారం గ్రామంలోని యువకులు సిమెంట్, కంకర వేసి పూడ్చి పలువురికి ఆదర్శంగా నిలిచారు. కొన్ని నెలలుగా రహదారిపై గుంతలు ఏర్పడి ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. అధికారులకు ప్రజా ప్రతినిధులకు సమస్య మోరపెట్టుకున్నా పెడచెవిన పెట్టారని పలువురు యువకులు తెలిపారు. చేసేది లేక ఓబులాపూర్ తండాకు చెందిన అర్జున్, కాశిరాం, రాజు, శేఖర్, బాను అను యువకులు సిమెంట్, కంకరను గుంతలలో పోసి మరమ్మతులు చేపట్టారు. యువకులను పలువురు వాహన చోదకులు, రైతులు అభినందించారు.

ధర్మపురి: ధర్మపురి మండల ఎలక్ట్రీషియన్స్ అండ్ ప్లంబర్ వర్కర్స్ కమిటీ సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సమావేశానికి మండలంలోని ఎనిమిది గ్రామాలకు చెందిన సుమారు 100 మంది ఎలక్ట్రీషియన్స్ అండ్ ప్లంబర్ వర్కర్స్ హాజరయ్యారు. ఈ కమిటీ ధర్మపురి లక్ష్మీ నరసింహ ఎలక్ట్రికల్ అండ్ ప్లంబర్ కార్మిక సంఘం పేరు నమోదు చేశారు. ఈ సంఘం భారతీయ మజ్దూర్ సంఘ్ అనుబంధ సంఘం గౌరవ అధ్యక్షులుగా ఎదులాపురం సత్యనారాయణ, అధ్యక్షులుగా గడిపెల్లి రాజశేఖర్, ఉపాధ్యక్షులుగా పుల్లూరి శ్రీకాంత్, తుమ్మనపెల్లి లక్ష్మణ్, ఎనగందుల అనిల్, ప్రధాన కార్యదర్శిగా దేవరకొండ సురేష్‌ను ఎన్నుకున్నారు. అర్గనైజింగ్ సెక్రటరీగా రాగూర్ రాకేష్, టి. శరత్ చంద్ర, కోశాధికారిగా పులి శ్రీనివాస్, కార్యవర్గ సభ్యులుగా బరిగెల ప్రశాంత్, ఎడ్ల అనిల్, గరిగంటి చంద్రయ్య, మాదాసు రాకేష్, నాగరాజు, కుమ్మరి రాజశేఖర్, మామిడి సత్యంను ఎన్నుకున్నారు. సమావేశంలో సభ్యులు అందరి సమ్మతి మేరకు భారతీయ మజ్దూర్ సంఘ్ అనుబంధంగా ఏర్పాటు చేశారు.

కొడిమ్యాల: మండల కేంద్రానికి చెందిన ఉప్పునూటి దేవరాజుకు చెందిన ఆవు కుక్క కాటుతో శనివారం మృతి చెందింది. మండల కేంద్రంలో కుక్కల బెడద ఎక్కువగా ఉండటంతో భయాందోళన చెందుతున్నారు.

జగిత్యాల అగ్రికల్చర్ : జిల్లా కేంద్రంలోని మానస స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో 9వ తరగతి చదువుతున్న శిరీచంద్ర హైద్రాబాద్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి ప్రజ్ఞా వికాస్ వ్యాసరచన పోటీలలో రాష్ట్రస్థాయిలో రెండవ ర్యాంకు సాధించినట్లు ప్రిన్సిపాల్ రజితరావు తెలిపారు. ట్రస్మా ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో శిశిర్ చంద్ర చూపిన ప్రతిభకు రూ.8వేల నగదు బహుమతి ఇస్తూ అభినందిచినట్లు తెలిపారు. డైరెక్టర్‌లు శ్రీధర్‌రావు, హరిచరణ్‌రావు, మౌనిక రావు తదితరులున్నారు.

కథలాపూర్ : మండలంలోని ఊట్‌పల్లిలో ఆదివారం సీఎంఆర్ఎఫ్ నిధి కింద మంజూరైన రు. 21వేల చెక్కును కాంగ్రెస్ నాయకులు పంపిణీ చేశారు.

మల్యాల : మండలంలోని తాటిపెల్లి గ్రామ ఆదర్శ రైతు సంఘం అధ్యక్షుడిగా ఆదివారం తుకుంట్ల నర్సింహారెడ్డి ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడిగా తుకుంట్ల లింగారెడ్డి, కోశాధికారిగా దొంగ లక్ష్మారెడ్డి, కార్యదర్శిగా సూర జనార్దన్‌రెడ్డి, పాలక వర్గ సభ్యులుగా నర్ర తిరుపతి రెడ్డి, అట్ల నగేష్, సూర రాజేందర్, సూర సాయి, రాజేందర్‌రెడ్డి ఎన్నికయ్యారు.

రాయికల్: మండలంలోని ఇటిక్యాల నివేదిత ఆశ్రమంలో రాయికల్ మండల మాజీ ఎంపీపీ ఉత్కం రాధసాయగౌడ్ తమ పెద్దల జ్ఞాపకార్థం వృద్ధులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో మహిపాల్ రెడ్డి, పెగ్గెర్ల రాజేశ్వర్‌గౌడ్, గాడిపెల్లి అంజాగౌడ్, హరిప్రియ దంపతులు, కొల్లూరు వేణు, అనుపురం లింబాద్రి గౌడ్ పాల్గొన్నారు.

కొడిమ్యాల : మండలంలోని నామపల్లి గ్రామంలో ఆదివారం బీజేపీ సభ్యత్వ మండల కన్వీనర్ చల్ల శ్రీనివాస్‌రెడ్డి ఇంటింటికి వెళ్లి బీజేపీ సభ్యత్వ నమోదును చేయించారు. నాయకులు సాయిబాబా, వెంకట్‌రావు, వెంకటేష్, రాంగోపాల్, శివ, శివాజీ పాల్గొన్నారు.

మృత్యువులోనూ వీడని బంధం

గంటల వ్యవధిలో అన్నదమ్ముల మృతి

ఎండపల్లి, సెప్టెంబర్ 22 : మృత్యువులోనూ అన్నదమ్ముల బంధం వీడలేదు. తమ్ము డు మృతి చెందిన విషయాన్ని జీర్ణించుకోలేక అన్న కూడా తీవ్ర మనోవేదనకు గురై 24 గంటలు గడవక ముందే అన్న కూడా తుది శ్వాస విడిచిన ఘటన జగిత్యాల జిల్లా ఎండపల్లి మండలంలోని పాతగూడూరులో విషాదం నింపింది. గ్రామస్తులు తెలిపిన కథనం మేరకు.. గ్రామానికి చెందిన రెడ్డిమల్ల నర్సయ్య(75), రెడ్డిమల్ల వెంకటయ్య(77) ఇద్దరూ అన్నదమ్ములు. కొన్ని రోజుల క్రితం తమ్ముడు నర్సయ్య గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతూ సర్జరీ చేయించుకున్నాడు. పరిస్థితి విషమించి శుక్రవారం రాత్రి మృతి చెందాడు. నర్సయ్య దహన సంస్కారాల్లో పాల్గొన్న అన్న వెంకటయ్య తమ్ముడు తనను విడిచి పోయాడంటూ తీవ్ర మనోవేదనకు గురయ్యాడు. కుటుంబ సభ్యులతోనూ తమ్ముడి జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ బాధపడ్డాడు. ఈ క్రమంలో శనివారం రాత్రి ఇంట్లోనూ ఒక్కసారిగా కుప్ప కూలి మృతి చెందాడు. 24 గంటలు గడవక ముందే అన్నదమ్ములు మరణించడంతో కుటంబంలో విషాధ చాయలు అలుముకున్నాయి.

ఎమ్మెల్యేను పదవి నుంచి తొలగించాలి

ఆల్ ఇండియా అంబేద్కర్ సంఘ నాయకుల డిమాండ్



అంబేద్కర్‌కు నివాళర్పిస్తున్న అంబేద్కర్ సంఘ నేతలు

కోరుట్ల, సెప్టెంబరు 22 : అంబేద్కర్‌ను అవమాన పరిచిన ఎమ్మెల్యేను పదవి నుంచి తొలగించి కఠినంగా శిక్షించాలని ఆల్ ఇండియా అంబేద్కర్ సంఘ నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని కొత్త బస్టాండ్ ప్రాంతంలోని అంబేద్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేసి నిరసన తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని పశ్చిమగోదావరి జిల్లా ఉండి నియోజకవర్గ ఎమ్మెల్యే రామకృష్ణరాజు అంబేద్కర్‌ను అవమాన పరిచే విధంగా ప్రవ ర్తించి అక్కడ ఏర్పాటు చేసిన ఫ్లెక్సీని తొలగించారని ఆరోపించారు. ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు స్పందించి అంబేద్కర్‌ను కించపరిచిన ఎమ్మెల్యేతో పాటు అతని అనుచరులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ సంఘ నాయకులు ఉయ్యాల శోభన్, ఉయ్యాల నర్సయ్య, బలిజ రాజారెడ్డి, కృష్ణప్రసాద్, వేణుగోపాల్, దేవయ్య, ఎడ్ల ప్రభాకర్, సంజీవ్, విజ్ఞాన్, మాదేశ్, దిగ్నేష్, నరేందర్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు.

విశ్వవిద్యాలయానికి పొట్టి శ్రీరాములు పేరు తొలగించడం అమానుషం



మాట్లాడుతున్న ఆర్యవైశ్య సంఘం నాయకులు

మెట్‌పల్లి, సెప్టెంబరు 22 (ఇబ్రహీంపట్నం) : తెలుగు విశ్వవిద్యాలయానికి పొట్టి శ్రీరాములు పేరు తొలగించడం అమానుషమని ఆర్య వైశ్య మహాసభ అధ్యక్షులు మైలారపు లింబాద్రి అన్నారు. ఆదివారం సంఘం నాయకులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భాషా ప్రయుక్త రాష్ట్రాల కోసం ప్రాణ త్యాగం చేసిన అమరజీవి పొట్టి శ్రీరాములు పేరు తొలగించడం సరకాదని అన్నారు. ఆర్యవైశ్య మహాసభ తెలంగాణ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు అన్ని మండలాల, జిల్లాల నుంచి సీఎంకు మెమొరాండం ఇచ్చామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి బుడికె శ్రీకాంత్, నాయకులు చాడ చందు, నూనె శ్రీనివాస్, మైలారపు రాంబాబు, దొంతుల లక్ష్మీనారయణ, శ్రీనివాస్, శివ, శ్రీనివాస్, కిరణ్ పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన



నిర్వాహకులను సన్మానిస్తున్న వైద్యులు

గొల్లపల్లి, సెప్టెంబరు 22 : మండలంలోని దమ్మన్నపేట గ్రామంలో ఆది వారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి గ్రామస్థుల నుంచి విశేష స్పందన లభించింది. జిల్లా కేంద్రానికి చెందిన శాంతి పిల్లల జనరల్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఆస్పత్రి వైద్యుడు కల్లెం దీపక్‌రెడ్డి ఉచితంగా 95 మంది పిల్లలను పరీక్షించి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా సీనియర్ నాయకులు బొలిశెట్టి నరేష్, తాజా మాజీ ప్రజాప్రతినిధులు మిల్కూరి అనసూర్య, చంద్రయ్య, మాదాసు నంది రవి, గ్రామస్థులు పాల్గొన్నారు.

సమాజ సేవ గొప్ప వరం

లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్



లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ వేంకటేశ్వర్‌రావును సన్మానిస్తున్న సభ్యులు

ధర్మపురి, సెప్టెంబరు 22: సమాజ సేవ అనేది గొప్ప వరమని లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ నడిపెల్లి వేంకటేశ్వర్‌రావు అన్నారు. ధర్మపురి పట్టణంలో లయన్స్ క్లబ్ 320 జి స్పెషల్ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్ సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లయనిజం పేరు చరిత్రలో నిలిచేలా లయన్స్ క్లబ్ సేవా కార్యక్రమాలు ఉండాలని తెలిపారు. ధర్మపురి లయన్స్ క్లబ్ ప్రపంచ స్థాయికి ఎదగాలని ఆయన ఆకాంక్షించారు. లయన్స్ డైరెక్టర్స్, ప్రాథమిక సభ్యులు తమకు వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన అన్నారు. మానవ సేవయే మాధవ సేవగా ముందుకు వెళ్లాలని ఆయన కోరారు. అనంతరం నిరుపేద మహిళకు కుట్టు మిషన్, ఐదుగురు నిరుపేద మహిళలకు దుప్పట్లు ఆయన అందించారు. అంతకు ముందు ఆయన సతీసమేతంగా స్థానిక శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారిని దర్శనం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ధర్మపురి పట్టణ అధ్యక్షులు రాపర్తి నర్సయ్య, జోన్ క్లబ్ చైర్మన్ డాక్టర్ ఇందారపు రామకృష్ణ, కార్యదర్శి స్తంభంకాడి రమేష్, డీసీ జక్కు రవీందర్, క్లబ్ ఆడ్మినిస్ట్రేటర్ రాజేంద్రప్రసాద్, రీజియన్ చైర్మన్ రాజేందర్, పాత శేఖర్, ఇరుకుల ఆనంద్, వినోద్‌రావు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సహాయం

భీమారం, సెప్టెంబరు 22: భీమారం మండల కేంద్రంలో ఫీల్డ్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న పోగుల సంఘవి భర్త మల్లేష్ ఇటీవల అనారోగ్యంతో మరణించాడు. విషయం తెలుసుకున్న 1998-99 పదవ తరగతి బ్యాచ్ విద్యార్థులు తమ వంతుగా ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో జిర్ఫ్ స్వచ్ఛంద సంస్థ చైర్మన్ అంగడి ఆనంద్ కుమార్, కొత్తపెల్లి రాజ్ కుమార్, పురాణపు రామానుజం తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న దేవీ వైభవం ప్రవచనం

జగిత్యాల క్రైం, సెప్టెంబరు 22 :జగిత్యాల జిల్లా కేంద్రంలోని కృష్ణానగర్‌లో ఉన్న శ్రీ షిరిడి సాయి బాబా ఆలయంలో నిర్వహిస్తున్న దేవీ వైభవ ప్రవచనం కార్యక్రమం మూడవ రోజు ఆదివారం కొనసాగింది.. ఈ సందర్భంగా ప్రముఖ వేద పండితుడు విష శర్మ ఆధ్వర్యంలో భక్తులకు ప్రవచనాలు వినిపించారు. అనంతరం భక్తులు లలితా సహస్రనామ స్తోత్ర పారాయణం నిర్వహించారు. ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ అడువాల జ్యోతి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అధ్యక్షుడు సతీష్ కుమార్, నిర్వాహకులు మార కైలాసం, తవుటు రామచంద్రం, కమటాల శ్రీనివాస్ ఉన్నారు.

ఆర్యవైశ్య మహాసభ జిల్లా నూతన కార్యవర్గం



నియామక పత్రాలు అందజేస్తున్న జిల్లా అధ్యక్షుడు

మెట్‌పల్లి, సెప్టెంబరు22 (ఇబ్రహీంపట్నం): జిల్లా ఆర్యవైశ్య మహాసభ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నట్లు ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షులు మైలారపు లింబాద్రి తెలిపారు. జిల్లా ప్రధాన కార్యదర్శిగా బుడికె శ్రీకాంత్ అదనపు ప్రధాన కార్యదర్శిగా చాడ చందు, భవన నిర్మాణ కమిటీ చైర్మన్‌గా నూనె శ్రీనివాస్, జిల్లా యువజన సంఘం అధ్యక్షులుగా కాసం రాజశేఖర్‌లను నియ మించినట్లు ఆయన తెలిపారు. నూతనంగా ఎన్నికైన వారికి ఆయన నియామక పత్రాలు అందజేశారు. నూతనంగా నియామకమైన వారిని పలువురు అభినందించి పూలమాలలు, శాలువతో ఘనంగా సత్కరించారు. .

ఘాట్ రోడ్డుపై మొరాయించిన ఆర్‌టీసీ బస్సు

బీర్‌పూర్, సెప్టెంబరు 22: బీర్‌పూర్ ఘాటు రోడ్డు ఎక్కే క్రమంలో ఆర్‌టీసీ బస్సు ఆదివారం మొరాయించింది. దీంతో అర గంగటపాటుగా ప్రయాణికులు ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని గడిపారు. జగిత్యాల నుంచి కమ్మునూర్ కలమడుగు మీదుగా జన్నారం, కడెం మండలాలకు మూడు బస్సులు నడుస్తుంటాయి. ఒక్కే బస్సు మూడు ట్రిప్పులుగా నడుస్తుంటాయి. ఈ క్రమంలో ఆదివారం మధ్యహ్నాం కడెం నుంచి జగిత్యాలకు వస్తున్న బస్సులో కెపాసిటీకి మించిన ప్రయాణికులు ఎక్కడంతో బీర్‌పూర్ ఘాటు(చిన్న మేరు) ఎక్కే క్రమంలో బస్సులో ఉండాల్సి కెపాసిటీ 56 మంది కంటే 100 ఎక్కారు. దీంతో బస్సు ఫెయిల్ అయి గుట్ట పైనే నిలిచి పోయింది. దీంతో బస్సులో ఉన్న ప్రయాణికులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని కిందకు దిగి బస్సును వెనుక నుంచి ఘాటు ఎక్కే వరకు నెట్టారు. కాసేపటికి ప్రయాణకులు ఊపిరి పీల్చుకున్నారు.

వీధుల్లో కుక్కల స్వైర విహారం

●జంకుతున్న జనం.. ●పట్టించుకోని అధికారులు



రోడ్లపై సంచరిస్తున్న వీధి కక్కులు

కోరుట్ల, సెప్టెంబరు 22 : పట్టణంలోని పలు వార్డులలో వీది కుక్కల స్వైర్య విహారం కొనసాగుతుంది. వీధులోకి రావడానికి జనం జంకుతున్నారు. పట్టణ శివారు కాలనీలలో కుక్కలు స్వైర్యవివారం జరుగుతండంగా మున్సిపల్ అధి కారులు నిర్లక్ష్యం చేయ్యడం విమర్షలకు తావిస్తుంది. గడిచిన మూడుల నెలల్లో 220 వరకు కుక్క కాట్లు ప్రభుత్వ ఆసుపత్రిలో నమోదు కాగా ప్రైవేట్ ఆసుపత్రివి లేక్కకు రానంతంగా నమోదు అయి ఉన్నాయి. పట్టణంలో 33 వార్డులు ఉండగా అందులో సుమారు 25 వార్డులలో వీధి కుక్కల సంచార ఎక్కువగా ఉన్నట్లు గతంలో మున్సిపల్ అధికారులు గుర్తించారు. సరైన ఆహారం దొరక పోవడంతో కలుషిత ఆహారం తింటూ జనంపై ఎగబడుతున్నా యన్న వాదనలు వినిపిస్తున్నాయి. అర్బన్ కాలనీ, మాదాపూర్, అల్లమయ్య గుట్ట, ఏసీకోని గుట్ట ప్రాంతాలలో మరి దారణంగా ఉంది. ఇండ్లలోకి చొరబడి వండుకున్న బోళ్లను సైతం ఎత్తుకుపోతున్న సంఘటనలు చోటు చేసుకుం టున్నాయి. ఆ మధ్య కాలంలో ఓ ఇంట్లోకి వెళ్లిన వీధి కుక్క అడ్డు వచ్చిన చిన్న పిల్లవాడితో నలుగురు కుటుంబ సభ్యులను కరవడంతో ఆసుపత్రి పాలు అయిన సంఘటన తెలిసిందే. పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో జులైలో 87 మంది, ఆగస్టులో 98 మంది, సెప్టెంబరులో ఇప్పడి వరకు 30 మందిని కుక్కలు కరిచినట్లు నమోదు అయి ఉంది. ఇప్పటికైన మున్సిపల్ అధికారులు ఆలోచించి వాటిని పట్టణం నుంచి తరలించే విధంగా చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

అ'పూర్వ'సమ్మేళనం



రాయికల్ పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో పాల్గొన్న విద్యార్థులు

మెట్‌పల్లి రూరల్, సెప్టెంబరు, 22 : దాదాపు 45 ఏళ్ల తర్వాత పూర్వ విద్యార్థులు అపూర్వ సమ్మేళనం ఏర్పాటు చేసుకున్నారు. మెట్‌పల్లిలోని ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని 1978-79వ బ్యాచ్‌కు చెందిన పదవతరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించుకున్నారు. 45ఏళ్ల తర్వాత ఏర్పాటు చేసుకున్న కార్యక్రమానికి ఇతర ప్రాంతాలో స్థిరపడిన విద్యార్థులు తరలివచ్చారు. తమతో చదువుకొని మృతిచెందిన స్నేహితులకు రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఆత్మీయ పలక రింపులు, ఆలింగనాల మధ్య నాటి మధుర స్మృతులను నెమరువేసుకున్నారు. విద్య నేర్పిన గురువులు గంధ్ర ఆనందరావు, శంకరయ్య, నరసిం హారెడ్డిలను ఘనంగా సన్మానిం చారు. అనంతరం ఒక్క చోటు చేరుకొని సహపంక్తి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో కోట గంగాధర్, మగ్గిడి వెంకటనర్సయ్య, పోహర్ హేమచందర్, దురిశెట్టి మనోహర్, భూపాల్, వంగరి మధుసూదన్, గోపి, ఉమా మహేశ్వర్, బేతు గౌతం, పూర్వవిద్యార్థులు, కుటుంబ సభ్యులు, పాల్గొన్నారు.

మెట్‌పల్లి, (ఇబ్రహీంపట్నం): పట్టణంలోని శ్రీ శ్రీనివాస గురుకులం 1998 99 బ్యాచ్‌కు చెందిన పదవతరగతి విద్యార్థుల పూర్వవిద్యార్థుల సమ్మేళనం అపూర్వంగా జరిగింది. పట్టణంలోని నరేందర్ రెడ్డి గార్డెన్‌లో ఆదివారం అందరు ఒకచోట చేరి ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. అలనాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఉపాధ్యాయ బృందంను పూలమాల, శాలువతో ఘనంగా సత్కరించారు. సేవే మా మార్గం-సేవే మా లక్ష్యం పేరుతో ఎర్పాటు చేయనున్న ఫౌండేషన్ బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

జగిత్యాలరూరల్ : జగిత్యాల రూరల్ మండలంలోని హన్మాజీపేట శివారులో గల లక్ష్మీగార్డెన్‌లో పొరండ్ల ప్రభుత్వపాఠశాల 2003-2004 పదోతరగతి పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆటపాటలతో కనువిందు చేశారు. పూర్వ విద్యార్థులు తమ జ్ఞాపకాలను ఒకరికొకరు నెమరు వేసుకున్నారు. తమకు విద్యను నేర్పిన గురువులను ఘనంగా సత్కరించారు. లక్ష్మీగార్డెన్‌లో పాత విద్యార్థులు ఒకేచోట కలవడంతో ఆనందం అవధులు దాటింది.

రాయికల్, సెప్టెంబరు 22: రాయికల్ పట్టణంలోని ఆర్ఆర్ గార్డెన్‌లో ఆదివారం 1994-95 బ్యాచ్ పదవతరగతి చదువుతున్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. 120 మంది పూర్వ విద్యార్థులు హాజరై గురువులను ఘనంగా సన్మానించారు. తరగతి గదుల్లో గడిపిన జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ రోజంతా ఉత్సాహంగా, ఉల్లాసంగా ఆట, పాటలతో గడిపారు. ఈ సమ్మేళనంలో బూర్ల సంతోష్ దుబాయ్ నుంచి బోగ రవీందర్ ముంబాయి నుంచి వచ్చి పాల్గొన్నారు.



వెల్లుల్లలో కలుసుకున్న పూర్వ విద్యార్థులు



ఒకచోట కలుసుకున్న పూర్వ విద్యార్థులు



లక్ష్మీగార్డెన్‌లో ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు